సాక్షి
మంచిర్యాల
గురువారం । 25 । మే । 2023



ఆర్టీసీలో 'కూల్'గా ప్రయాణం

మండుతున్న ఎండలతో ప్రయాణికుల నుంచి ఏసీ బస్సులకు డిమాండ్ పెరిగింది. రెండు మూడు రోజుల ముందుగానే ప్రయాణానికి టికెట్ బుకింగ్ చేసుకుంటున్నారు. 8లో▸

జూన్ 1న స్థాయీ సంఘ సమావేశాలు

మంచిర్యాలటౌన్: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జూన్ 1న స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, నిర్మాణ పనులు, ప్రణాళిక, ఆర్థిక సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా వడగాలులు వీస్తాయి. ఎండల తీవ్రత పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

చేతికి పోడు పట్టా!


వేమనపల్లి: దస్నాపూర్‌లో పోడు దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఎఫ్ఆర్సీ కమిటీ సభ్యులు(ఫైల్)

- జిల్లాలో అర్హులైన వారి జాబితా సిద్ధం
- వచ్చే 24 నుంచే సాగుదారులకు పంపిణీ
- పరిశీలన తర్వాత భారీగా తగ్గిన సంఖ్య

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పోడు భూములకు పట్టాల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. వచ్చే నెల 24నుంచి 30వరకు పంపిణీ చేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన నేపథ్యంలో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా పరిశీలన అనంతరం అర్హుల జాబితా సిద్ధమైంది. పట్టాలు పొందిన వారికి బ్యాంకు ఖాతాలు ప్రభుత్వమే తెరిచి రైతుబంధు కూడా అందించనుంది. దీంతో జిల్లాలో ఏళ్లనాటి పోడు భూముల పట్టా కల నెరవేరనుంది. యేటా వానాకాలం సీజన్ ఆరంభంలోనే అటు అటవీ, ఇటు సాగుదారులకు నిత్యం భూమి కోసం ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ సీజన్ ఆరంభంలోనే పట్టాలు ఇవ్వనున్న నేపథ్యంలో తిప్పలు తప్పనున్నాయి. నిబంధనలు, పరిశీలన కమిటీల ఆమోదం మేరకే అర్హులకు పట్టాలు అందనున్నాయి.

వేలాదిగా దరఖాస్తులు

ఆర్వోఎఫ్ఆర్(అటవీ హక్కుల గుర్తింపు చట్టం) 2006 ప్రకారం సాగు చేసుకునేందుకు హక్కులు కల్పించాలని వేలాది మంది డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గత ఏడాది పోడు పట్టాల సాగుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పంచాయతీ, అటవీ, రెవెన్యూ, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో పరిశీలించారు. కొన్నింటిని తిరస్కరించారు. గిరిజన, గిరిజనేతరుల నుంచి పెద్ద ఎత్తున పట్టాల కోసం వినతులు వచ్చాయి. జీవో నంబరు 140 ప్రకారం పోడు దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఎఫ్ఆర్సీ (ఫారెస్టు రైట్స్ కమిటీ)లతో సర్వే చేశారు. ఈ కమిటీల్లో పోడు సాగులో ఉన్న గ్రామాల నుంచే సభ్యులను ఎంపిక చేసి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలన చేశారు. ఫారెస్టు బీట్ ఆఫీసరు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో పరిశీలన చేసి సంతకాలు తీసుకున్నారు. మొదట ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరిగింది. ప్రధాన నిబంధనల్లో గిరిజనులను 2005వరకు, గిరిజనేతరులను 1930కంటే ముందు సాగులో ఉన్నట్లుగా లేదా మూడు తరాల వారు ఆ భూమిని అనుభవిస్తున్నట్లుగా రుజువులు అడిగారు. చాలామంది తగిన రుజువులు చూపించలేక తిరస్కరణకు గురయ్యాయి.

పోడు దరఖాస్తులు, అర్హుల వివరాలు

గిరిజనులు	4,460మంది
విస్తీర్ణం	13,587ఎకరాలు
గిరిజనేతరులు	7,314మంది
విస్తీర్ణం	19,830ఎకరాలు
పోడు పట్టాల అర్హులు	1847మంది
విస్తీర్ణం	3821ఎకరాలు

పరిశీలన తర్వాత తిరస్కరణ

పోడు పట్టాలు ఇస్తారనే ఆశతో అనేకమంది సాగులో ఉన్న వారితోపాటు లేనివారు, అర్హత ఉన్నా లేకపోయినా దరఖాస్తులు చేసుకున్నారు. అటవీ హక్కుల కమిటీ పరిశీలనలో చాలా వరకు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో అర్హుల సంఖ్య భారీగా తగ్గింది. జిల్లాలో గిరిజన, గిరిజనేతరులు మొత్తం 11,777మంది 33,417 ఎకరాలకు పట్టాల కోసం వినతులు ఇచ్చారు. వీరిలో 1847 మందిని అర్హులుగా గుర్తించినట్లు సమాచారం. మొత్తం 3,821ఎకరాల్లో అర్హులు అటవీ భూములను సాగు చేసుకున్నట్లు గుర్తించారు. ఇక గిరిజనేతరులు దరఖాస్తుల్లో పేర్కొన్న ప్రకారం సరైన ఆధారాలు లేని కారణంగా తిరస్కరణ గురైనట్లు తెలుస్తోంది. ఇక గిరిజనుల్లోనూ ఒకే కుటుంబం నుంచి వేర్వేరుగా దరఖాస్తులు, స్థానికంగా ఉండని వారు, మోకాపై లేకున్నా ఉన్నట్లుగా వెల్లడైంది. వీటితోపాటు అటవీ శాఖ గూగుల్ మ్యాప్‌లో ఆధారంగా ఎప్పటి నుంచి పోడు సాగు అవుతుందో తెలుసుకుని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో దరఖాస్తుదారులకు, పంపిణీ చేసే పట్టాలకు భారీగా తేడా ఉన్నట్లు తెలుస్తోంది.

యూనిఫాం గడువులోగా అందేనా..!

- విద్యాశాఖ ప్రత్యేక దృష్టి
- 31వరకు ఇవ్వాలని ఆదేశాలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే యూనిఫాంపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 31లోపు దర్జీ వద్ద యూనిఫాంలు కుట్టించే పనులు పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం 21రోజులపాటు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనుంది. ఇందులో భాగంగా జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం రోజున ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫాం అందజేయనున్నారు. గతంలో పాఠశాలలు ప్రారంభమైనా పూర్తిస్థాయిలో యూనిఫాంలు విద్యార్థులకు చేరని పరిస్థితి ఉంది. రోజుల తరబడి యూనిఫాంల పంపిణీ జరిగింది. గత అనుభవాల దృష్ట్యా ఈసారి యూనిఫాంలు ముందస్తుగా కుట్టడం పూర్తి చేసేలా విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. ఇందులో భాగంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన డీఈవో యాదయ్య గత వారం రోజులుగా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయా మండలాల దర్జీల వద్దకు నేరుగా వెళ్లి యూనిఫాంల పరిస్థితులపై అంచనా వేయడంతోపాటు నెలాఖరు వరకు పూర్తి చేయాలని సూచిస్తున్నారు.

మండలాల వారీగా..

జిల్లాలో 796 ప్రభుత్వ పాఠశాలల్లో 45,309 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకు అవసరమైన ముడి వస్త్రం 2,32,750 మీటర్లు జిల్లాకు వచ్చింది. ఇప్పటికే ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయగా నచ్చిన చోట డ్రెస్‌లు కుట్టిస్తున్నారు. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, మందమర్రి మండలాలకు చెందిన యూనిఫాంలు ఓ మహిళ దర్జీకి ఇచ్చారు. తాండూర్, నెన్నెల మహిళ దర్జీకి ఇవ్వగా, చెన్నూర్, భీమారం, కోటపల్లి మండలాలకు సంబంధించిన చెన్నూర్‌లో ఓ దర్జీ వద్దకు చేర్చారు. దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారంతోపాటు పలు మండలాలకు సంబంధించి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు స్థానికంగా ఉండే దర్జీలకు డ్రెస్‌లు కుట్టించే పనులు అప్పగించారు.


దర్జీ వద్ద యూనిఫాంలు పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య, ఎంఈవో పోచయ్య

డిజైన్ మార్చడంతో ..

2023–24 సంవత్సరానికి గాను విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తుల డిజైన్ మార్చడంతో టైలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో డ్రెస్‌కు రూ.50 చెల్లిస్తుండడంతో గిట్టుబాటు కాకపోగా డిజైన్‌లు మార్చడం వల్ల ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. 1నుంచి 3 వరకు బాలికలకు బాడీ ఫ్రాక్‌లు, రైట్‌సైడ్ లోపలికి ఒక పాకెట్, ఎదురు కుచ్చిళ్లు, 2 ఇంచుల వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు, సూటింగ్ క్లాత్‌తో కుట్టాలి. 4, 5వ తరగతులకు బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు, 6 నుంచి 12వ తరగతి బాలికలకు పంజాబీ డ్రెస్ డిజైన్ చేశారు. టాప్, రెండు చేతుల క్లిప్‌లు, ముందు భాగాన యూ ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేసి కుట్టాల్సి రావడంతో సమయం పడుతోంది. ఇప్పటివరకు జిల్లాలో 20నుంచి 25శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ నెలాఖారుకు యూనిఫాంలు కుట్టడం పూర్తవుతాయో చూడాలి.

ఈ నెలాఖరు పూర్తి చేయాలి

విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫాంలు తప్పనిసరిగా ఈ నెలాఖారుకు పూర్తి చేయాలి. పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం. పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫాంలు విద్యార్థులకు అందాలంటే ఈ నెల 31వరకు టార్గెట్ విధించాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

న్యూస్‌రీల్

ధాన్యం సేకరణ పూర్తి చేయాలి

- రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్
- కలెక్టర్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్


పాల్గొన్న కలెక్టర్ బి.సంతోష్


మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల, వెనుకబడిన తరగతుల, సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, మేనేజింగ్ డైరెక్టర్ వి.అనిల్‌కుమార్, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుందని, క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. రాష్ట్రంలో 70 శాతం వరకు ధాన్యం సేకరణ పూర్తి కావచ్చిందని, మరో 15 రోజు ల్లో మిగతా ధాన్యం అంతా కొనుగోలు చేయడంపై కలెక్టర్లు దృష్టి సారించాలని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాని తెలిపారు. పక్క రాష్ట్రం నుంచి ధాన్యం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 85 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు ట్యాగ్ చేశామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్, మంచిర్యాల ఆర్డీవో వేణు, జిల్లా పౌర సరఫరాల శాఖ అ ధికారి ప్రేమ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

యూనిఫాం కుట్టడం పూర్తయ్యేలా చూడాలి


యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఈవో


జన్నారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫాం కుట్టడం జూన్ 2లోగా పూర్తయ్యేలా చూడాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో యూనిఫాంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు. ఎన్ని యూనిఫాంలు పూర్తయ్యాయి, ఎన్ని కుట్టాల్సి ఉందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా విద్యాశాఖ సిబ్బంది చౌదరి, ఎంఈవో విజయ్‌కుమార్, సీపీఎస్ అధ్యక్షుడు దాముక కమలాకర్, పాఠశాల హెచ్‌ఎం జాజల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాయపూర్ సదస్సుకు ఎఫ్‌డీవో


సదస్సులో ప్రసంగిస్తున్న ఎఫ్‌డీవో మాధవరావు

జన్నారం: ఛత్తీసగఢ్ రాష్ట్రం రాయపూర్‌లో బుధవారం నిర్వహించిన అటవీ సదస్సులో జన్నారం అటవీ డివిజన్ అధికారి సిరిపురం మాధవరావు పాల్గొని ప్రసంగించారు. నీటి సంరక్షణ, భూమికోతకు గురికాకుండా చూసే విధానం, వర్షాకాలంలో నీరు వృథా పోకుండా కాపాడుకునే విధానం, గడ్డి మైదానాలు ఏర్పాటు అంశాలపై వివరించారు. 17 రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షుడిగా పర్రె రమేష్


పర్రె రమేశ్

శ్రీరాంపూర్: ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షుడిగా పర్రె రమేష్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాదులో జరిగిన రాష్ట్ర సమావేశంలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రమేష్ మంచిర్యాల జిల్లా కార్యదర్శి గా రెండు సార్లు, కాగజ్‌నగర్ డివిజన్ కార్యదర్శిగా రెండుసార్లు, మంచిర్యాల డివిజన్ కార్యదర్శిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా.. రాష్ట్ర ప్రధాన ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నికపై జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు యూనిస్, నాయకులు బోరే మోహన్‌రావు, లక్ష్మయ్య, భూ మన్న శ్రీధర్, మహేందర్‌రెడ్డి, శంకర్, సత్యనారాయణ అభినందించారు. రమేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పరిపాలన సౌలభ్యం కోసమే కలెక్టరేట్


కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న విప్ సుమన్, కలెక్టర్ సంతోష్

- ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- సమీకృత కలెక్టరేట్ పనుల పరిశీలన

నస్పూర్: జిల్లా ప్రజలకు పరిపాలన సౌలభ్యం, క్షేత్ర స్థాయిలో సుపరిపాలన అందించేందుకే సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణం చేపట్టినట్లు ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. బుధవారం ఆయన కలెక్టర్ బాదావత్ సంతోష్, అదనపు కలెక్టర్లు మధుసూదన్‌నాయక్, బి.రాహుల్‌తో కలిసి నస్పూర్‌లో సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, ఈ నెలాఖరుకు గానీ జూన్ మొదటి వారంలో గానీ జిల్లాలో సీఎం కేసీఆర్ పర్యటన ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవం, వైద్య కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తారని పేర్కొన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.1658 కోట్ల వ్యయంతో చేపట్టనున్న చెన్నూర్ ఎత్తిపోతల పథకానికి, మందమర్రి పట్టణ సమీపంలో రూ.500 కోట్ల వ్యయంతో నిర్మించబోయే ఆయిల్‌పాం ఫ్యాక్టరీకి భూమి పూజ చేస్తారని వివరించారు. గోదావరి నదిలో అంతర్గాం నుంచి మంచిర్యాల వరకు వంతెన నిర్మాణ పనులు, అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేస్తారని తెలిపారు. దశాబ్ది ఉత్సవాలను విజవంతం చేయాలని కోరారు. అనంతరం నస్పూర్‌లో నిర్మించిన జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ భవనాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కౌన్సిలర్లు వంగ తిరుపతి, పూదరి కుమార్, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన ధాన్యం సేకరణ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ బి.సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, బి.రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి జిల్లా వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు, మంచిర్యాల ఆర్డీవో వేణు, రైస్‌మిల్లర్లతో వరిధాన్యం కొనుగోలు, రవాణా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు, రైస్‌మిల్లులకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ యజమానులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. వర్షాలు పడేలోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే విధంగా సమష్టిగా కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయని రైస్‌మిల్లులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి.శేషాద్రి, ఏసీపీ తిరుపతిరెడ్డి, రైస్‌మిల్లర్లు, ట్రాన్స్‌పోర్టు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వేదికపై విప్ సుమన్, ఎంపీ వెంకటేష్


విజేతలకు బహుమతులు అందిస్తున్న మంత్రి, విప్, ఎంపీ, ఎమ్మెల్యేలు

- గ్రామస్థాయి నుంచి ప్రాధాన్యత కల్పిస్తున్నాం
- త్వరలోనే ఆర్‌కేపీ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాటుకు చర్యలు
- బహుమతి ప్రదానోత్సవంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- ముగిసిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలు

రామకృష్ణాపూర్: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఎక్సైజ్, యువజన, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల ముగింపు కార్యక్రమానికి బుధవారం మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సంకల్పంతో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. క్రీడల్లో రాణించే వారికి చక్కటి భవిష్యత్ ఉంటుందనేది ప్రతి ఒక్కరూ గుర్తించాలని తెలిపారు. ఇంత అట్టహాసంగా పోటీలు నిర్వహించిన రామకృష్ణాపూర్ పట్టణంలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులున్నారని, సువిశాలమైన స్థలం గల ఇక్కడి స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సూచన మేరకు త్వరలోనే డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అంచెలంచెలుగా ఈ స్టేడియంను అభివృద్ధి చేస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ మూడు రోజుల జిల్లా స్థాయి పోటీలు విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు మరింత పోరాటపటిమ, క్రీడాస్ఫూర్తితో రాణించి భవిష్యత్తులో విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 11 అంశాల్లో జరిగిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి ఎంపీవెంకటేష్‌నేత, ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఎమ్మెల్సీ దండే విఠల్, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్, టీఎస్‌టీటీసీఎఫ్‌సీ చైర్మన్ పల్లె రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, స్థానిక ప్రజాప్రతినిధులు దితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం

– మంత్రి శ్రీనివాస్‌గౌడ్

రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న వారు దశాబ్దాలుగా పట్టాల కోసం పోరాడారని, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఈ ప్రాంత వాసుల కల నెరవేరిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని రామాలయం చౌరస్తాలో 6వ విడత ఇళ్ల పట్టాల పంపిణీలో భాగంగా 776 మందికి బుధవారం రాత్రి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ సింగరేణి స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి పట్టాలు పంపిణీ చేయాలన్న ఆలోచన గత పాలకులకు ఎవరికీ రాకపోవడం దురదృష్టకరమని అన్నారు. ఇళ్ల స్థలాలపై పూర్తి యాజమాన్య హక్కులు కల్పించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని తెలిపారు.


పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి, విప్

'ఉపాధి' పనులకు ఎండదెబ్బ

- తగ్గిన కూలీల హాజరు శాతం
- ఒక్కో పంచాయతీలో వందకు తగ్గకుండా ఆదేశాలు


మందమర్రి మండలంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పాతమంచిర్యాల: జిల్లాలో ఉపాధి హామీ పథకం పనులపై ఎండల ప్రభావం పడుతోంది. మండుతున్న ఎండలతో పనులకు హాజరయ్యే కూలీల శాతం తగ్గుతోంది. వ్యవసాయ పనులు ముగిసిన తర్వాత ఫిబ్రవరి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు జోరుగా సాగేవి. ప్రతీ రోజు జిల్లా వ్యాప్తంగా 30 వేల మందికి తగ్గకుండా హాజరయ్యేవారు. కానీ మే నెలలో ఎండల వల్ల పనులు మందకొడిగా సాగుతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 40డిగ్రీలు దాటుతుండడంతో పనులకు వెళ్లడానికి కూలీలు సాహసించడం లేదు. ఎండలకు తోడు పెళ్లిళ్లు, శుభకార్యాలు ఉండడం కూడా కూలీల సంఖ్య తగ్గడానికి కారణమని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 310 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈ నెల 16న 25,801మంది కూలీలు హాజరు కాగా, హాజరుశాతం 83 నమోదైంది. మరుసటి రోజు 24,944 మంది హాజరు కాతా 76శాతానికి పడిపోయింది. ప్రతీ గ్రామ పంచాయతీలో వంద మందికి తక్కువ కాకుండా పనులకు హాజరయ్యేలా చూడాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు కూలీలకు నచ్చజెప్పి పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. అయినా లక్ష్యం మేరకు కూలీల హాజరు శాతం పెరగడం లేదని అంటున్నారు.

అదనపు కూలి జాడేది..?

ఉపాధి హామీ పథకంలో ఫిబ్రవరి నుంచి మే వరకు రాష్ట్ర ప్రభుత్వం కూలీలకు అదనంగా కూలి చెల్లించేది. ఫిబ్రవరిలో 20శాతం, మార్చిలో 25శాతం, ఏప్రిల్, మే నెలల్లో 30శాతం చెల్లించేది. కానీ గత ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్ నరేగా నుంచి ఎన్ఐసీకి మార్చిన తర్వాత అదనపు కూలి జాడలేకుండా పోయింది. కూలీలకు పలుగు, పారల షార్పెనింగ్ కోసం రూ.10, నీటి వసతి కోసం రూ.10, పని స్థలం ఐదు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటూ మరో 10శాతం రవాణా భత్యం ఇచ్చేవారు. వీటన్నింటిని రద్దు చేసి కూలి రూ.257 నుంచి రూ.272గా నిర్ణయించింది. దీంతో కూలీలు ఏడు గంటలు పని చేసి ఉదయం, సాయంత్రం పని స్థలంలో ఫొటో దిగాల్సి ఉంటుంది. ఎండల వేడికి కూలీలు పనులకు వెళ్లడానికి జంకుతున్నారు. పని స్థలాల్లో వసతులు లేక అవస్థలు పడుతున్నారు. సేద దీరడానికి అధికారులు నీడ టెంటు సౌకర్యం కల్పించడం లేదని, పని స్థలాల్లో దెబ్బ తగిలితే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో ఉంచడం లేదని కూలీలు వాపోతున్నారు. కనీస వసతుల కల్పనపై అధికారులు స్పందించడం లేదని, ఇన్ని ఇబ్బందుల మధ్య పని చేసినా కూలి రూ.200కు మించి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొలతల ప్రకారం కూలి చెల్లింపు

ఉపాధి కూలీలు చేసిన పనుల కొలతల ఆధారంగా లెక్కించి కూలీ డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నాం. పోస్టాఫీస్‌లు బ్యాంకుల్లో వారి వేతనాలు జమ అవుతున్నాయి. కూలీలు ఆధార్ లింక్ చేసుకు న్న బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేస్తున్నాం.

– బి.శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల

క్లుప్తంగా

ఎట్టకేలకు ఊరట..!

- శాంతియుత నిరవధిక సమ్మె ఫలితం
- సీఎం హామీతో జేపీఎస్‌ల్లో ఆనందం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల (జేపీఎస్, ఓపీఎస్)కు ఎట్టకేలకు ఊరట లభించింది. జేపీఎస్‌లను క్రమబద్ధీకరణ చేస్తామని సీఎం కేసీఆర్ సోమవారం నిర్ణయం తీసుకోవడంతో ఆనందం వ్యక్తమవుతోంది. తమను రెగ్యులర్ చేయాలని ఏప్రిల్ 28 నుంచి మే 13 వరకు శాంతియుత నిరవధిక సమ్మెలో భాగంగా వివిధ రూపాల్లో నిరసన చేపట్టారు. చర్చల విషయంలో స్పష్టత రాకపోవడం, విధుల్లో చేరితే సమస్య పరిష్కరిస్తామన్నా కార్యదర్శులు ససేమిరా అన్నారు. దీంతో ప్రభుత్వం కూడా ఇకపై చర్చలు జరిపేది లేదంటూ ఒక దశలో వారిని తొలగించి కొత్తవారిని నియమించాలని నిర్ణయించింది. చివరగా జరిగిన చర్చలు ఆశాజనకంగా ఉండడం, ప్రభుత్వ మద్దతు ఉంటుందన్న మంత్రి, అధికారుల హామీతో జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మె విరమించారు.

కార్యదర్శుల పనితీరుపై కమిటీ

జిల్లాలో రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 51 మంది, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 218 మంది, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు 41 మంది ఉన్నారు. వీరిలో పది మంది రాజీనామా చేయగా ఒకరు సస్పెండ్ అయ్యారు. ఇక జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పనితీరు ప్రామాణికంగా విధివిధానాలను నిర్ణయించేలా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. కమిటీలో అదనపు కలెక్టర్, ఎస్పీ, జిల్లా అటవీ అధికారి ఉంటారు. కలెక్టర్ నివేదిక మేరకు రాష్ట్ర కమిటీ జేపీఎస్‌ల రెగ్యులర్ విషయంలో నిర్ణయం తీసుకోనుంది.

మరింత బాధ్యతగా పని చేస్తాం..

ప్రభుత్వం జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తామనే ప్రకటనతో మాపై మరింత బాధ్యతను పెంచింది. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేస్తూ గ్రామాల అభివృద్ధికి పాటుపడుతాం. సీఎం కేసీఆర్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావులకు మా కుటుంబాలు రుణపడి ఉంటాయి. గ్రామాల్లో పారిశుధ్య పనులు, పల్లెప్రగతి, పన్నుల వసూళ్లలో ప్రభుత్వ లక్ష్యాలను సాధించేలా నిరంతరం కష్టపడి పనిచేస్తాం. – సంధ్యారాణి, జేపీఎస్, ఖాజీపల్లి, భీమారం మండలం

గాయపడిన వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని తోషం గ్రామానికి చెందిన కొ ల్లూరి నర్సయ్య (53) కాలనీలో జరిగిన గొడవలో తలకు గాయమై చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో నర్సయ్య తాగిన మై కంలో దావ నారాయణ అనే వ్యక్తితో గొడవ పడ్డాడు. నర్సయ్యను నెట్టి వేయడంతో కిందపడి తలకు తీవ్రగాయమైంది. రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

లారీ రాదు.. ధాన్యం కదలదు



భీమారం మండలంలోని కొనుగోలు కేంద్రంలో లారీలు రాక నిల్వ ఉన్న ధాన్యం బస్తాలు

- అదే తిప్పలు, అవే కుప్పలు
- ధాన్యం రైతుల పడిగాపులు
- కమ్ముకుంటున్న మేఘాలు, ఆందోళనలో అన్నదాతలు
- గన్నీ సంచులు, వాహనాల కోసం ఎదురుచూపులు

మంచిర్యాల జిల్లాలో సాగు వివరాలు..

జిల్లాలో సాగు విస్తీర్ణం	94.256 ఎకరాలు
దిగుబడి అంచనా	2.54 లక్షల మెట్రిక్‌టన్నులు
ధాన్యం సేకరణ లక్ష్యం	2.28 లక్షల మెట్రిక్‌టన్నుల
కొనుగోలు కేంద్రాలు	ఏర్పాటు 262
ధాన్యం సేకరిస్తున్నవి	243
మూతపడినవి	18
ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం	88,612 మెట్రిక్ టన్నులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ధాన్యం రైతులకు ఏటా ఇదే పరిస్థితి.. ధాన్యం దిగుబడి వచ్చే సమయానికి కొనుగోలు కేంద్రాలు, గన్నిసంచులు, టార్పలిన్ కవర్లు, తేమ యంత్రాల కోసం, మిల్లుల వద్ద లారీల లోడుతో పడిగాపులు కాస్తున్నారు. లారీలు రాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. ఇప్పటికే అకాల వర్షాలతో రైతులు నష్టపోయారు. మళ్లీ రెండు రోజులుగా జిల్లాలో ఆకాశం మేఘావృతం అవుతూ అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అలస్యం కారణంగా అకాల వర్షాలు కురిస్తే ధాన్యం వర్షార్పణం అవుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. టార్పలిన్ కవర్లు అందుబాటులో లేక రైతులు ఫ్లెక్సీ బ్యానర్లలలో ధాన్యం పోసుకున్నారు. మరికొందరు రైతులు రోజుకు రూ.30, 40 చొప్పున కిరాయి తెచ్చుకొని ధాన్యం రాశులు నిల్వచేసుకుంటున్నారు.

కేంద్రాల ప్రారంభం.. సేకరణలో అలసత్వం

వానాకాలంలో కురిసిన భారీవర్షాలతో నీటి నిల్వలు పెరగడంతో పెద్ద మొత్తంలో పంట వేసుకున్నారు. 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా గత నెల 19 నుంచి ఇబ్బడి ముబ్బడిగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 11,716 మంది రైతుల నుంచి రూ.173.68 కోట్ల విలువ చేసే 88,612 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఇందులో 73 వేల వరకు మిల్లలకు తరలించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 250 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 262 ఏర్పాటు చేశారు. ఇందులో 243 కొనుగోలు కేంద్రాలల్లో మాత్రమే ధాన్యం సేకరిస్తున్నారు. ఐకేపి 41, ఎఏఎస్‌సీ 120, డీసీఎంఎస్ 82 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారుగా 30వేల బస్తాలతో పాటు ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా కనిపిస్తున్నాయి.

లారీలు వస్తలేవు..



నాలుగు ఎకరాల్లో వరి సాగు చేస్తే 130 బస్తాల వడ్లు వచ్చినయి. సెంటర్‌కు వడ్లు తెచ్చి 20రోజులు అవుతంది. సంచులు లేవు, లారీలు సక్కగ వస్త లేవు, కాంట పెడత లేరు. ఇన్నే రాత్రి పగలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తు ఉండడు అవుతుంది. భారీ వర్షం వస్తే వడ్లు చేతికి రాకుండా పోతాయి. – నప్పిడి సంతోష్, చింతపుడి.కన్నెపెల్లి

వానస్తే వడ్లు నీటి పాలే..



పదిరోజులు అవుతంది వడ్లు సెంటర్‌కు తెచ్చి. లారీలు వస్తలేవు. ఇంక ఎన్ని రోజులు ఎదురుచూసుడో అర్థం అయితలేదు. ఎండకు వడ్లు మంచిగా ఎండిన తేమ తక్కువగానే ఉంది మబ్బులు పడుతున్నాయి. చిరుచిరు జల్లులు పడుతున్నాయి. భారీ వర్షం వస్తే నష్టపోవుడు అవుతుంది. – బొయిని మల్లేష్, అంకుష్‌పూర్, భీమిని

లారీలతో ఎలాంటి ఇబ్బంది లేదు..

కొనుగోలు కేంద్రాలకు రోజుకు 175 లారీలు పంపిస్తున్నాం. 3 నుంచి 4వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలిస్తున్నాం. జిల్లాలో మొత్తం 54 రైస్ మిల్లలకు 19మంది రైస్ మిల్లులు డిఫాల్ట్‌లో ఉన్నాయి. మరో 18 రారైస్ మిల్లులు కావడంతో తీసుకోవడం లేదు. ఆదిలాబాద్, కరీంనగర్ రైస్ మిల్లలకు తరలిస్తున్నాం. ఇప్పటికే 89వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం. – ప్రేమ్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

రూ.20చొప్పన 10కవర్లు కిరాయికి తెచ్చిన..

కవర్లు లేక ఊళ్లో తెలిసిన వాళ్ల దగ్గర రూ.20చొప్పున 10కవర్లు కిరాయి తెచ్చిన. ఐదు రోజులకు రూ.1000 దాక అవుతాయి. రెండు రోజులుగా మబ్బులు పడుతున్నాయి. మైచర్ ఎక్కువగా ఉందని ఆరబెట్టుమంటున్నారు. వెంటనే కొంటే మంచుగుండు. రోజుల కొద్ది ఉంటే వర్షం వస్తే తడిసిపోయి నష్టపోవాల్సి వస్తది. – రాజన్న, మందమర్రి

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

బెల్లంపల్లి: హైదరాబాద్‌లో అదృశ్యమైన బెల్లంపల్లి విద్యార్థి తరుణ్ జవార్ ఆచూకీ లభ్యమైంది. హైదరాబాద్ ఆగాపూరా పాన్ మండి ప్రాంతంలో నివాసం ఉంటున్న అమ్మమ్మ ఇంటి వద్ద ఉండి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి తరుణ్‌జవార్ బుధవారం అదృశ్యమైన విషయం తెలిసిందే. కళాశాలకు వెళ్తున్నాని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన తరుణ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఓ రైలెక్కాడు. బుధవారం ఓ వ్యక్తి సెల్‌ఫోన్ తీసుకుని తండ్రి మంగీలాల్ జవార్‌కు తరుణ్ నేరుగా ఫోన్ చేసి ఏడ్చుకుంటూ మాట్లాడి తాను ముంబయి వచ్చినట్లు చెప్పాడు. దీంతో తీవ్రమైన ఉత్కంఠకు తెర పడింది. సెల్‌ఫోన్ ఇచ్చిన వ్యక్తి తరుణ్‌ను నేరుగా స్థానిక పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించాడు. పోలీసులు మంగీలాల్‌కు ఫోన్ చేసి నిర్ధారణ చేసుకుని తమవద్ద ఉంచుకున్నారు. మంగీలాల్ ముంబయిలో ఉన్న బంధువులకు ఫోన్ చేసి సమాచారాన్ని చేరవేశారు. ఠాణాకు వెళ్లిన బంధువులు మంగీలాల్‌ను పోలీసులతో మాట్లాడించి తమ ఇంటికి తీసుకెళ్లారు. ఏ కారణంతో తరుణ్ ముంబయికి వెళ్లాడో తెలియరాలేదు. కాగా కొడుకును తీసుకు రావడానికి మంగీలాల్ జువార్ ముంబయికి వెళ్లాడు. విద్యార్థి అదృశ్యం కథ సుఖాంతం కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సారంగపూర్: మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన నాకిడి గంగన్న బుధవారం జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మోపెడ్‌లో పెట్రోలు పోయించుకునేందుకు జామ్ గ్రామంలోని పెట్రోల్ బంక్‌కు వెళ్తున్నాడు. ఇదే సమయంలో సోన్ మండల కేంద్రానికి చెందిన సుంకరి నర్సయ్య పల్సార్ బైక్‌పై వేగంగా వచ్చి గంగన్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గంగన్న తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు నిర్మల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

టింబర్ యార్డు కార్మికుల సమస్యలు తీర్చాలి

- హెచ్ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని హెచ్ఎమ్మెస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్ డిమాండ్ చేశారు. వారి సమస్యలపై ఆ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్టోర్స్ గేట్ ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికులు 30ఏళ్లుగా ఎదుగుబొదుగు లేని జీతాలతో నష్టపోతున్నారన్నారు. వారు చేసే పనికి నాలుగు కేటగిరీ వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం మొదటి కేటగిరీ వేతనం పొందుతున్నారన్నారు. ఎస్ఎల్పీ, ఇంక్రిమెంట్లు, అలవెన్సులు రాక ఆర్థికంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో వారు రిటైర్డ్ అయ్యాక వారికి గాట్యూటీ, పెన్షన్ తక్కువగానే వస్తుందన్నారు. దీనిపై గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, ఏఐటీయూసీ నేతలు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో టింబర్ యార్డు కార్మికులు తమ యూనియన్‌ను ఆశ్రయిస్తే వారిపై ఈ సంఘాల నేతలు బెదిరింపులకు గురిచేస్తున్నారని వివరించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా ఉచిత మస్టర్లు పడుతూ ఆ సంఘాల నేతలు కంపెనీకి నష్టం చేస్తున్నారన్నారు. దీంతో పాటు స్టోర్స్‌లో ప్రమాదాలు జరిగినప్పుడు ఏ మాత్రం సంబంధం లేని క్లర్కులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకుంటున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా ఉద్యోగులకు వాష్ రూమ్స్ సరిగ్గా లేవన్నారు. అనంతరం అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. ఆ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షులు జక్కుల నారాయణ, బ్రాంచీ కార్యదర్శి తిప్పారపు సారయ్య, నాయకులు గొల్ల సత్యనారాయణ, డి.శ్రీనివాస్, రేగుంట సందీప్, ఎలుక నారాయణ, అశోక్, రాజ్‌కుమార్, ఐత వెంకటస్వామి, గొర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో 'కూల్'గా ప్రయాణం

- మండుతున్న ఎండలతో ఏసీ బస్సులకు డిమాండ్
- రెండు, మూడు రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్



మంచిర్యాల డిపోలో నిలిపిన ఏసీ బస్సులు

మంచిర్యాలఅర్బన్: రోజురోజుకూ ఎండలు మండిపోతున్నాయి. పగటివేళ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారు ఎయిర్ కండీషన్డ్ (ఏసీ) బస్సుల వైపు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ చార్జీలున్నా లగ్జరీ బస్సుల కంటే ఏసీ బస్సులకు ప్రాధాన్యమిస్తూ చార్జీలను లెక్కచేయడం లేదు. హైదరాబాద్‌కు వెళ్లాలనుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రెండు, మూడు రోజుల ముందుగానే అడ్వాన్స్ బుకింగ్ చేసుకుంటున్నారంటే డిమాండ్ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సాధారణ రోజుల్లో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య తక్కువే. ఎండలు తీవ్రంగా ఉండడంతో ప్రతి ట్రిప్పులో బస్సు ఫుల్ అవుతుందని చెబుతున్నారు డ్రైవర్లు. సమ్మర్ నేపథ్యంలో ఏసీ బస్సులు మరిన్ని పెంచాలనే డిమాండ్ లేకపోలేదు.

ఏడు బస్సులు.. ఎనిమిది ట్రిప్పులు

మంచిర్యాల –హైదరాబాద్‌కు రాజధాని ఏసీ బస్సులు ఏడు ఉండగా ఎనిమిది ట్రిప్పులు వేయాల్సి ఉంది. ఇందులో పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించిన బస్సులు లేవని తెలుస్తోంది. మొదట్లో డిపోలో మూడు ఏసీ బస్సులు ఉండేవి. తర్వాత కాలంలో ఇతరత్రా డిపోలకు చెందిన పాత బస్సులు ఇక్కడకు కేటాయించారు. బస్సులో ఏసీ ప్రాబ్లమ్, ఇతరత్రా సమస్యలతో నిత్యం మొరాయిస్తున్నట్లు తెలుస్తోంది. పేరుకు ఏడు బస్సులున్నా ఆరు బస్సులు మాత్రం రాకపోకలు సాగిస్తాయి. వారం కిందట వరకు మూడు బస్సులు మాత్రమే నడిచినట్లు తెలుస్తోంది. బస్సుల్లో విధులు నిర్వహించే అటెండర్లు విధులు మానేశారు. 16మంది చేసే చోట ఎనిమిది మందితోనే విధులు చేయాలనడంతో విధులకు దూరంగా ఉంటూ వచ్చారు. అధికారులు, కాంట్రాక్టర్‌కు మధ్య చర్చలు సఫలం కావడంతో రెండు నెలలుగా డిపోలకే పరిమితమైన బస్సులు నాలుగు రోజులుగా రోడ్డెక్కాయి. ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న ఏసీ బస్సులకు అంతకంతకు డిమాండ్ పెరిగిపోయింది. పాత బస్సుల స్థానంలో కొత్త బస్సుల ఏర్పాటుతో కూల్‌గా ప్రయాణం సాగించేలా చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఖరీఫ్‌లో సాగు యోగ్యమైన వరి రకాలు

సాగుబడి



బెల్లంపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు యోగ్యమైన వరి రకాలను వ్యవసాయ శాఖ సిఫారసు చేసింది. వాతావరణ స్థితిగతులు, చీడపీడలు ఇతర ప్రతికూల పరిస్థితులను తట్టుకునే రకాలను సిద్ధం చేశారు. వీటిలో దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్ప కాలిక రకాలు ఉన్నాయి. దొడ్డు గింజ, సన్న గింజ రకాలను రైతాంగానికి అందుబాటులో ఉంచారు. రైతులు సాగు చేయడానికి అనుకూల రకాలు, వాటి గుణగణాలను బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన శాస్త్రవేత్త ఎం.రాజేశ్వర్‌నాయక్ వివరించారు.



రాజేశ్వర్ నాయక్, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త ,బెల్లంపల్లి

వరి రకాలు, వేసుకునే సమయం..

దీర్ఘకాలిక

వరంగల్ 44(సిద్ధి), సాంబ మసూరి పంట కాలం 140 రోజులు ఉంటుంది. మే 25 నుంచి జూన్ 25వరకు సాగు చేయవచ్చు.

మధ్యకాలిక

రాజేంద్రనగర్ 2458(కృష్ణ), వరంగల్ 32100(వరంగల్‌సన్నాలు), వరంగల్ 915, జగిత్యాల 384(పాలాసప్రభ) పంట కాలం 135 రోజులు ఉంటుంది. జూన్ 25వరకు సాగు చేయవచ్చు.

స్వల్పకాలిక

కునారం 1638, కునారం 118(కునారం సన్నాలు), జగిత్యాల 18047(బతుకమ్మ), వరంగల్ 962, రాజేంద్రనగర్ 21278, రాజేంద్రనగర్ 15048(తెలంగాణసోన), రాజేంద్రనగర్ 29325, మారుటేరు 1010(కాటన్ దొర సన్నాలు) పంట కాలం 125రోజుల కంటే తక్కువగా ఉంటుంది. జూన్ 25వరకు సాగు చేసుకోవచ్చు.

కొత్తగా విడుదలైన వరి రకాలు, లక్షణాలు

- కంపసాగర్ 2874 పంట కాలం 140 రోజులు ఉంటుంది. సన్న గింజరకం , చౌడు నేలలకు అనుకూలం, దోమపోటునుతట్టు కుంటుంది.
- రాజేంద్రనగర్ 11718 పంట కాలం 140రోజులు ఉంటుంది. సన్నగింజరకం, అగ్గి తెగులు, ఎండాకు తెగులు, సుడి దోమను మధ్యస్తంగా తట్టుకుంటుంది. చౌడు నేలలకు అనువైనది.
- జగిత్యాల 28545 పంట కాలం 135 రోజులు ఉంటుంది. సన్న గింజరకం , బియ్యం నాణ్యత బాగా ఉండి అన్నం రుచి సాంబమసూరి లాగా ఉంటుంది. బ్యాక్టీరియా ఆకు, ఎండుఆకు తెగులు, మెడ విరుపును మధ్యస్తంగా తట్టుకుంటుంది.
- జగిత్యాల 27356 పంట కాలం 135 రోజులు ఉంటుంది. అతి సన్నగింజరకం, అన్నం నాణ్యత చాలా బాగుంటుంది.
- జేజీఎల్24423 పంట కాలం 135 రోజులు ఉంటుంది. దొడ్డురకం. గింజరాలదు. పంటపడిపోదు. సుడిదోమను కొంతవరకు తట్టుకుంటుంది. కొంతవరకు చౌడును తట్టుకుని అధిక దిగుబడిని ఇచ్చే వంగడం. మెడ విరుపును తట్టుకోదు.

అందని వడ్డీ రాయితీ..!

- రెండు నెలలకు పైగా ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఎదురుచూపు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు కేతి వజ్రవ్వ. దండేపల్లి మండలం వెలగనూర్ ఇందిరమ్మ మహిళా సంఘం అధ్యక్షురాలు. వీరి సంఘానికి ప్రభుత్వం వడ్డీ రాయితీ కింద రూ.26వేలు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాన్ని మహిళా దినోత్సవం రోజున అందించింది. కానీ ఇంతవరకు తమ ఖాతాలో వడ్డీరాయితీ మాత్రం జమకాలేదని వజ్రవ్వ చెబుతోంది.




సమావేశమైన సంఘ సభ్యులు (పాత చిత్రం)

దండేపల్లి: స్వయం సహాయక సంఘాల సభ్యులకు అన్ని విధాలా చేయూత నందిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, మహిళ సంఘాలకు బకాయిపడిన వడ్డీరాయితీలను వారివారి ఖాతాల్లో వేస్తామని మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించింది. ప్రకటన చేసి సుమారు రెండు నెలలు దాటినా ఇంతవరకు వడ్డీ రాయితీ వారి ఖాతాల్లో జమ కాక పోవడంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు రాయితీ డబ్బులు ఎప్పుడు ఖాతాల్లో జమవుతాయా? అని ఎదురుచూస్తున్నారు. తమ తమ సంఘాలకు వచ్చే వడ్డీ రాయితీ పత్రాలను మహిళా దినోత్సవం రోజున అందించారు. కానీ రాయితీ మాత్రం రాలేదు.

రూ.12.62 కోట్లు మంజూరు..

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకు లింకేజి ద్వారా రుణాలు అందిస్తున్నారు. ఎలాంటి వడ్డీలేకుండా రుణాలు ఇవ్వాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు 2018–19 నుంచి ఇప్పటి వరకు వడ్డీ రాయితీ ఇవ్వలేదు. రుణాలు పొందిన సంఘం సభ్యులే బ్యాంకులో అసలుతో పాటు వడ్డీ చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఎప్పటికైనా తాము చెల్లిస్తున్న వడ్డీని రాయితీ రూపంలో తిరిగి చెల్లిస్తుందనే నమ్మకంతో ఉన్నారు. 2018–19, 2019–20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీరాయితీలను చెల్లిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసింది. దీంతో మంచిర్యాల జిల్లాలోని 8,459 ఎస్‌హెచ్‌జీలకు రూ.12.62 కోట్ల వడ్డీరాయితీలను మంజూరు చేసింది. దీంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యుల్లో సంతోషం వెల్లివిరిసింది. కానీ రెండు నెలలు దాటిన వడ్డీరాయితీ మాత్రం అందలేదు.

రాయితీ అందించాలి...



మహిళా దినోత్సవం రోజున మహిళ సంఘాలకు రెండేళ్ల వడ్డీ రాయితీ అందిస్తున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించిన పత్రాలను సంఘాల లీడర్లకు అందించారు. రెండు నెలలు గడుస్తున్నా రా యితీ ఖాతాల్లో జమ చేయకపోవడం బాగోలేదు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వడ్డీరాయితీని ఖాతాల్లో జమచేయాలి. – సిరికొండ ఉమా, గ్రామ సంఘం అధ్యక్షురాలు, దండేపల్లి

ఖాతాల్లో జమవుతాయి...

మహిళా సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీని ప్రభుత్వం మహిళ సంఘం బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. సంఘాలకు రావాల్సిన వడ్డీరాయితీకి సంబంధించి మహిళా దినోత్సవం రోజున పత్రాలు అందించింది. కొద్దిగా ఆలస్యమైన గ్రూపు ఖాతాలో తప్పక జమవుతాయి. –శేషాద్రి, డీఆర్‌డీవో, మంచిర్యాల